# మళ్లీ పెళ్లి!

★

శ్రీ మో. స. చౌదరి బి. ఏ.

నా పేరు సూర్యనారాయణ. నేనుంటూవున్నది పట్టణమైనా చాల వెలుపల నాచుట్టుప్రక్కలంతా కలెక్టరాఫీసులోని గుమాస్తాలున్నారు. ప్రొద్దునలేచి పట్టణములోనికి కాఫీకి రావటం అలవాటు. ఇంగ్లీషు చదువువలన కలిగిన లాభంలేండి! ఆదినము జనవరి 26 వ తారీఖు. స్నానంచేసి తెల్లవారేటప్పటికే కాఫీకి వెళ్ళుదామని కొంచెం తెల్లవారుజామునే నిద్రలేచాను. చలి అమితముగా వేయుచున్నా నిద్రలేచి బయటికి వచ్చాను. నేను బయటికి వచ్చేటప్పటికి 'నారాయణా' అని పలువురుకలసి అనినట్లు వినిపించింది. ఒకప్రైపుకు చూడగా అచ్చట పదిమంది పిల్లలు చలిమంట వేచుకొనుచున్నారు. నేవెళ్ళేటప్పటికి నన్నుచూచి 'నారాయణా' అని నవ్వటం మొదలెట్టారు. చదివేది ఆంగ్లభాషైనా ఇది వినేటప్పటికి నా పేరులో 'నారాయణ' ఉన్నందువలన నన్నే వెగతాళి చేస్తున్నారని భయపడ్డాను.

అందరితోను జాగ్రత్తగా మాట్లాడితే ఏం జరుగుతుందిలే అని ధైర్యం తెచ్చుకుని కాలకృత్యాలు ముగించి నిత్యనైవేద్యానికి (కాఫీ) బయలుదేరాను. నేను నామిత్రుడైన వెంకట్రావుతో కలసి కాఫీ దేవాలయం చేరాను. అప్పటికే తద్దినాలు పెట్టించటానికి వెళ్లవలసిన కొందరు చాటుగా ఒకగదిలో కూర్చొని మెక్కుతున్నారు. ఒకతను హడావుడిగా తనప్రక్కన ఎవరో శుభ్రంగాతిని కాళీచేసిన సాసరు చూడక తీసుకొని దానిలో కాఫీ ఆరబోసుకొని త్రాగుచున్నాడు. మేము ఆప్రక్క కుర్చీలలోనే కూర్చోబోతున్నాము. ఇదంతాచూచిన సర్వరు 'నారాయణా' అన్నాడు. నా గుండె గుబేలుమన్నది. నామిత్రుడితో ఉదయంజరిగిన సంగతంతా చెప్పాను. అరే పిచ్చివాడా అని అన్నాడు. ప్రక్కనున్నవాళ్లు నవ్వుతారేమోనని టాపిక్ మార్చటానికి పెసరట్టు 'బుక్కయ్య' హోటల్‌లో బాగావుంటుందిరా అన్నాను. ఇంతలోనే సర్వరుకాఫీ తెచ్చి బిల్లిచ్చాడు.

గేటుదగ్గర డబ్బివ్వటానికి పరుగెత్తాను. బజారులో ఎవరో 'నారాయణా' అన్నట్లు వినిపించింది. బయటికివచ్చి చూస్తే ఆ దినము స్వాతంత్రదినోత్సవమగుటచే చాలమంది కాంగ్రెసు జండాలు, కర్షక జండాలు పుచ్చుకొని ఊరేగుతున్నారు. ముందున్నవారు గాంధిమహాత్మాకీ జై అంటే వెనుకున్నవారు 'నారాయణా' 'విన్నావా పంతులూ' అని అరవటం సాగించారు. ఇదంతావింటే నాకేదో ఆశ్చర్యం వేసింది. వీళ్ల వెంట వెళ్తే ఈశబ్దాలకు అర్థం తెలుస్తుందని నామిత్రుణ్ణి కూడా రమ్మన్నాను. వాడేవో పరీక్షలో క్లాసుకొట్టే వాడిలాగా 'నేవెళ్ళి చదువుకోవాలిరా' అన్నాడు. సరేలే అని నేనుమాత్రం వాళ్ల వెంట బయలుదేరాను.

ఊరేగింపు మైదానం చేరేవరకు కళ్ళజోళ్ల వారిని, కాలరులాల్చీలవారిని, పైజమాలవారిని, బిళ్ల గోచీలవారిని, గూడకట్లవారినీ, బెంగాలు లాల్చీల వారిని, నెహ్రూకోట్ల వారిని, గాంధి టోపీలవారిని చూడటంతో సరిపోయింది. మైదానం చేరేటప్పటికి పదిగంటలయింది. అందరు కూర్చున్నారు. ఒక కాంగ్రెసు నాయకుడులేచి "గాంధిమహాత్ముడు భారతదేశ స్వాతంత్ర్యంకోసమని చాల పాటుబడుచున్నాడు" అని యింకా ఏదో చెప్పబోతున్నాడు. అంతలోనే ఒకప్రక్కన ఎవరోలేచి "బోసు పాటుపడటంలా?"— 'నారాయణా' అని అన్నాడు. ఇంకా జనమంతా 'నారాయణ'మయమైంది. ఎవరినోటినుండి విన్నా నారాయణే! ఏప్రక్కకు తిరిగివిన్నా నారాయణే! వెనకముందు తిరిగినా నారాయణే! అక్కడక్కడ మాత్రం 'విన్నావా పంతులూ' అని వినిపించింది. ఈ అల్లరితో మీటింగు ఆగిపోయింది. దాంతోపాటు నా ప్రయత్నంకూడా ఆగిపోయింది. ఇటువైపుకు తిరిగి యింత గజబిజిచేసిన యీపదమున కర్థమేమి అని ఆలోచిస్తూ యిల్లుచేరాను. భోంచేసి యీపదాలకేమైనా గూడార్థమున్నదా అని డిక్షనరీ తిరగేశాను. ఏంకన్పించాయి కాదు. చిన్నప్పుడు మాపంతులు నన్ను 'వెధవా' అని తిట్టాడు. నాకు కోపంవచ్చి ఎందుకండీ తాతిడరన్నాను." ఆయన 'వె' అంటే వెయ్యేళ్ళని 'ధ' అంటే ధనముతో 'వ' అంటే వర్ధిల్లు అని అర్థంచెప్పి ఇది తిట్టుగాదు ఆశీర్వచనం అని చెప్పారు. ఆమాట గుర్తొచ్చి అట్లాంటి అర్థం నన్ను వేదించుచున్న పదాల్లో వున్నదా అని ప్రతిఅక్షరం విడిగా వెతికాను. 'నా'తో మొదలగు మాటలుచూడగా 'నార' 'నలుపు' 'నక్క' 'నవ్వు' ఇంకా యిట్లాంటివి వచ్చినవి. 'రా' మీద చూడగా 'రావణ' 'రామ' 'రాళ్లు' 'రవిక' మొదలైనవి గుర్తొచ్చినవి. ఈవిధంగా అక్షరాలన్నింటికి వెతికినా అర్థం గోచరించక తలనొప్పిపుట్టి పడుకున్నాను.

ఇంతలోకి వెంకట్రావచ్చి నిద్రలేపి "మూడు గంటలైతే యింకా పడుకున్నావేరా" అన్నాడు. తలనొప్పిగావుంటే పడుకున్నానురా అన్నాను. సరేలే! లేచి టాయిలెట్ చేసుకోరా మూర్తిగారింటిదగ్గర ఆరుగంటలవరకు హరికథవున్నది వెళ్దాం రమ్మన్నాడు. సరేలే అని బయలుదేరి అక్కడికి వెళ్లాం. "భగవంతుని ధ్యానించితే" పుణ్యంఅని చెప్పటం మొదలెట్టాడు. నేను నామిత్రుడు ముందు కూర్చున్నాం. మావాడికి యిట్లాంటివంటే చాల యిష్టంలెండి! భగవంతుడి విషయం రావటం ఆలస్యంగా, వెనకాలున్నవారెవరో 'నారాయణా' అని కేకలువేయ మొదలెట్టారు. హరికథ చెప్పేవానికి ఎక్కడలేని ఆవేశంవచ్చి మీకేనా Self respect indipendenc. freedom of speech కావాల్సింది? పైగా సోషలిస్టులమని చెప్పుకుంటారే! నేమాత్రం మనిషినికాదూ? నాకుమాత్రం అవన్నీ అవసరంలేదూ? అని సాగించాడు. వాళ్లుమాత్రం కానే పాగి మళ్ళి 'విన్నావా పంతులూ' అని సాగించారు. అప్పటికే యీఅల్లరితో సాయంత్రం 5½ గంటలయినది కథ సాగటంలేదు. నాకు మరీ పదేపదే యీపదాలు విన్నకొద్దీ పిచ్చెత్తిపోతుంది. కథ/యికసాగదని సినిమాకు వెళ్దాం అనుకున్నాను. నామిత్రుణ్ణి కూడావస్తా అని అడిగాను. మావాడికి సినిమాపిచ్చి తక్కువవటంచేతా పిచ్చిభక్తి ఎక్కువవటంచేత రానన్నాడు.

సరేలే సినిమాకెళ్తేనైనా యిది మరుపుకురాదా అని దేనికి వెళ్దామా అని ఆలోచిస్తూ బయలుదేరాను. అప్పుడు 'మళ్ళీ పెళ్ళి' 'పాండురంగవిఠల్' 'నలదమయంతి' మూడుహాల్సులో చూపుతున్నారు. మొదటిది అంతవరకు చూడలేదు. అదిగాక దారిలో ఎదురైన నా మిత్రుడు తిరుమలరావు యిదే బాగుంటుందని చెప్పాడు. రెండవది భక్తిగనుక నాకు నచ్చదు. మూడవదిఒకసారి చూచాను. అదీగాక ఏంటో 'పెళ్ళ'నేది మొదటి దాంట్లోవున్నది. నాకు పెళ్ళికాలేదులేండి! అందుకని దానికివెళ్తేనే బాగుంటుందని దానికే వెళ్లాను. కథ పెళ్లితో మొదలై పెళ్ళితో ఆఖరవుతుందనుకున్నాను. కాని అట్లాకాక ఒక స్వాములవారితో మొదలైంది. వాడినోటినుండి మొదటిమాట 'నారాయణా' అని వచ్చింది. ఇదేంటి ఎక్కడికెళ్లినా దెయ్యంలాగా నావెంటే/వస్తుందని విసుక్కున్నాను. కథజరిగిన కొద్దీ ఇది మరచాను. కాని కొంత జరిగేటప్పటికి ఆస్వాములవారు, 'విన్నావాపంతులూ' అని మొదలుపెట్టాడు. ఇదంతా చూస్తూవుంటే నాకదోలావుంది. ఇంతలోకే కథలో స్వాములవారు దొంగని యీవిధంగా మారువేషంలోవుండి ప్రజలను మోసం చేయుచున్నారని పోలీసులు అరెస్టుచేశారు. ఇప్పటికే టాకీవచ్చి నెలరోజులైంది. ఇదంతా తెలుసుకున్న తర్వాత యింతవరకూ నామనస్సును వేధించి నాహృదయంలో రైళ్లు పరుగెత్తించిన పదాలకు అర్థం తెల్సింది.

ఈటాకీ చూసినవాళ్లంతా ఎవరైనా మోసగాడు అని ఏడిపించటానికి 'నారాయణా' 'విన్నావా పంతులూ' అని అంటం మొదలెట్టారని తెలుసుకున్నాను. ఇదివినిన నామిత్రులంతా మీ అభిమాన పత్రిక ద్వారా అందరికి తెలియజేయవలసినదిగా ప్రోత్సహించిరి.

'మళ్ళీ పెళ్ళి' ఎంతపని చేసిందండీ అని అనుకున్నాను. 'విన్నావాపంతులూ' శెలవు తీసుకుంటాను.

"నారాయణ'


## చేతిపనుల వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

### కొక్కోకము

స్త్రీ పురుష రహస్యములు-64 చిత్రపటములతో 302 పేజీలుగల పెద్ద పుస్తకము. ధర రు 1-0-0. పోస్టుఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

### దాంపత్య మర్మములు

పడకటి ముచ్చటలు, రతి సంబంధమయిన అనేక మర్మవిషయము లిందు గలవు. 9 పటములలో 102 పేజీలు గల పెద్దపుస్తకము. ధర రు. 0-8-0. పోస్టుఖర్చులు 0-5-0. కొక్కోకము, దాంపత్యమర్మములు ఒకేదఫా రెండుకొనిన పోస్టుఖర్చులతో రు. 1-12-0.

### మహారాజ పుస్తకశాల

అరుణాచలమొదలి వీధి, 18 బీటు, మద్రాసు.